క్లుప్తంగా

యాసంగి సాగుకు నీటి విడుదల



బీబీపేట: మండల కేంద్రంలోని పెద్ద చెరువు నీటిని యాసంగి సాగు నిమిత్తం బుధవారం తూముల ద్వారా విడుదల చేశారు. చెరువుకు ఉన్న పటేల్ తూము, ఏనుగుల తూముల ద్వారా నీళ్లను వదిలారు. ఈ చెరువు ద్వారా పది గ్రామాల రైతులకు యాసంగి సాగుకు నీరందుతుంది. చివరి వరకు నీళ్లందేలా చూడాలని రైతులు, ఇరిగేషన్ అధికారులను కోరారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఇరిగేషన్ ఏఈ శివ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. పాఠశాలలోని 6 నుంచి 10వ తరగతి వరకు గల 67 మంది విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని అన్నారు.

బీసీ బాలికల వసతి గృహంలో నీటి ఎద్దడి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొన్నదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహంలో నీరు లేకపోవడంతో బయట నుంచి బకెట్లలో నీటిని తీసుకొచ్చి కాలకృత్యాలతో పాటు, స్నానానికి వాడుకుంటున్నామని వాపోయారు. హాస్టల్‌లో మిషన్ భగీరథ నీటితో పాటు, నల్లాలు రాకపోవడంతో నీటికి ఇబ్బంది కలిగిందని విద్యార్థినులు తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని బాల సదనం వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి బుధవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, స్టోర్ రూంలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బిస్కెట్లు పంపిణీ చేశారు. డీసీపీవో స్రవంతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఎల్లారెడ్డి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీవో పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డు పరిశీలన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల యూటర్న్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం హైవే అథారిటీ అధికారులు, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్‌లు రోడ్డును పరిశీలించారు. యూటర్న్ ప్రమాదాలకు నిలయంగా ఉండడంతో అధికారులు దృష్టి సారించారు. మండల కేంద్రం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, మోడల్ స్కూల్‌కు, అయ్యప్ప మందిరానికి వెళ్లాలంటే 44వ జాతీయ రహదారిని క్రాస్ చేసి వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు, గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా బ్రిడ్జిని ఏర్పాటు చేయడం మంచిదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజల విన్నపానికి అధికారులు స్పందించారు.

ఎలక్ట్రానిక్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

సుభాష్‌నగర్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ప్రజలు చలి బారిన పడకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్లను వినియోగిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మనిషి శరీరంలో భాగమైన సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను 10 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే స్థలాల్లో ఉంచాలి.

- సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు అధిక వేడి, చలికి తట్టుకోలేవు. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల వల్ల ఆటోమెటిక్‌గా హ్యాంగ్(బంద్) అవుతాయి.
- ముఖ్యంగా బ్యాటరీల సామర్థ్యం తగ్గిపోవడం, హార్డ్ డిస్క్‌లు చెడిపోవడం, టచ్ స్క్రీన్స్ పని చేయక పోవడం వంటి సమస్యలు ఉంటాయి.



- అధిక చలితో ఎలక్ట్రానిక్ వస్తువులు కుచించుకుపోయే(సింక్) తత్వాన్ని కలిగి ఉంటాయి.
- అధిక చలి, వేడి కారణంగా పరికరం ఆన్ కావడానికి కొంత సమయం పడుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ప్రతి ఇంట్లో ఎలక్ట్రానిక్ డివైజెస్ సర్వ సాధారణమయ్యాయి. అందులోనూ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం అధికంగా ఉంది.
- సాధారణ ఉష్ణోగ్రతలు ఉండే ప్రదేశాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులను ఉంచాలి. తేమశాతం లేని స్థలాన్ని ఎంచుకోవాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులను ఆరు బయట ఉంచొద్దు.

చలితో జాగ్రత్త..



– అనుముల విక్రమ్ రాజ్,
అమృత కంప్యూటర్స్ యజమాని

కోతుల కోసం బోను ఏర్పాటు

- ఆంధ్రా నుంచి కోతులను పట్టే వారిని రప్పించిన సీతారాంపల్లి గ్రామస్తులు
- ఒక్కో కోతికి రూ.500 చెల్లిస్తున్న ప్రజలు



బోనులో చిక్కుకున్న వానరాలు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని సీతారాంపల్లిలో మహిళలు, విద్యార్థులపై కోతులు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఒంటరిగా వెళ్లడానికి మహిళలు, రైతులు, చిన్నారులు భయపడుతున్నారు. కోతుల దాడులు ఎక్కువ కావడంతో గ్రామస్తులు ఫారెస్టు అధికారుల అనుమతితో కోతులు పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేశారు. కోతులు పట్టుకునే వ్యక్తులను ఆంధ్రా నుంచి పిలిపించారు. నాలుగు రోజుల నుంచి స్కూల్ పక్కన బోను ఏర్పాటు చేశారు. బోనులో ఫ్రూట్స్ ఇతర తినుబండారాలు ఉంచగా.. తినడానికి వచ్చిన కోతులు బోనులో చిక్కుకుంటున్నాయి. పట్టుకున్న వ్యక్తులకు ఒక్కో కోతికి రూ.500 గ్రామస్తులు చెల్లిస్తున్నారు. మూడు, నాలుగు రోజులలో వంద కోతులు పట్టుకున్నారు. బోనును వాహనంలో ఎక్కించి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కోతులను వదులుతున్నారు. దాడుల నుంచి రక్షణ పొందడానికి బోను ఏర్పాటు చేశామని, కోతులను క్షేమంగా అడవి ప్రాంతంలో వదులుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

కర్ణంగడ్డతండాలో పర్యటించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



తండావాసులతో మాట్లాడుతున్న అధికారులు ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని కర్ణంగడ్డ తండాలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మీనారాయణ బుధవారం పర్యటించారు. సాక్షి దిన పత్రికలో సమస్యల వలయంలో కర్ణంగడ్డ తండా అనే శీర్షికతో వార్తా కథనం బుధవారం ప్రచురితమైంది. కథనానికి అధికారులు స్పందించి తండాలో పర్యటించి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. తండాలో తాగు నీటి కోసం కొత్త పైపు లైను వేస్తామన్నారు. గురువారం ఏఈ వచ్చి పరిశీలించి అంచనాలు వేస్తారన్నారు. అంచనాల మేరకు నిధులు మంజూరు చేసి కొత్త పైపులైను వేసి ఇంటింటికి నల్లాలు అమర్చి తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీవో అన్నారు.

బెంబేలెత్తిస్తున్న చలి పులి



పిట్లంలో ఎండలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులను ఎండలో కూర్చోబెట్టిన సిబ్బంది

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పిట్లంలో చలికి తట్టుకోలేక ఎండలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- వసతి గృహాలలో చల్లని నీటితో స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



చల్లని నీటితో స్నానం చేయడానికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పిట్లం(జుక్కల్): జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. పిట్లం మండలంలో ముఖ్యంగా పాఠశాలలకు వచ్చే విద్యార్థులు చలి తీవ్రతను తట్టుకోలేకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాల మైదానంలో ఎండలో కూర్చోబెట్టి పాఠాలను బోధిస్తున్నారు. దీనికి తోడు విద్యార్థులు సైతం పాఠశాలలకు గతంలో మాదిరిగా సమయానికి రాలేకపోతున్నారు. కొంత ఆలస్యంగా వస్తున్నారు. చలి తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున కొంత మంది తల్లిదండ్రులు వారి పిల్లలను ఉదయం పూట పాఠశాలలకు పంపించడం లేదు. అంగన్‌వాడి సెంటర్లలో సైతం ఇదే పరిస్థితి ఉంది. వసతి గృహాలలో సైతం విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం లేకపోవడంతో చల్లని నీటితోనే స్నానం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి పాఠశాలలో, వసతి గృహాలలో విద్యార్థులకు వేడినీటి సౌకర్యంతో పాటు సరిపడా వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు మోటారు సైకిళ్ల ప్రారంభం



కామారెడ్డి క్రైం: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ట్రాఫిక్ పెట్రోలింగ్ మోటార్ సైకిళ్లను పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా, పట్టణం విస్తరిస్తున్న కారణంగా, నేరాలను అదుపు చేయటానికి ఆ మోటారు సైకిళ్లను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రారంభించామని సీఐ అన్నారు. ప్రధాన చౌరస్తాలలో ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించేందుకు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. అశోక్ నగర్, స్నేహపురికాలనీ, శ్రీరామ్‌నగర్, వివేకానందకాలనీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీలలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయన్నారు.

సమాచారం..

నేడు సీఎం కప్ యోగాసన పోటీలు

కామారెడ్డి అర్బన్: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి కలెక్టరేట్ సమీపంలోని జిల్లా యోగాభవన్‌లో యోగా స్పోర్ట్స్ పోటీలుంటాయని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎం.చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

రేపు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి అర్బన్: ఈ నెల 20న స్థానిక లయోల హైస్కూల్‌లో అండర్ -20 విభాగంలో బాలికలు, బాలుర కబడ్డీ క్రీడాకారుల ఎంపికలుంటాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వరగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బాలురు(70 కిలోల లోపు), బాలికలు(65కిలోల లోపు) బరువు కలిగి కల్గి ఉండాలన్నారు. బాలికలకు ఉదయం 9 గంటలకు, బాలురకు మధ్యాహ్నం 2 గంటలకు ఎంపికలుంటాయన్నారు. వివరాలకు 9398571110 సంప్రదించాలని సూచించారు.

21 నుంచి దేవునిపల్లి మల్లికార్జున స్వామి జాతర



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మల్లికార్జున స్వామి కల్యాణ ఉత్సవాలను ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గూడెల్లి గంగారాం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మల్లికార్జున స్వామి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు ఆహ్వాన పత్రికలు అందించి కార్యక్రమాలకు రావాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామని అన్నారు. మల్లికార్జున స్వామి కల్యాణ మండపం నూతనంగా నిర్మిస్తున్నందున దాతలు సైతం ముందుకు రావాలని కోరారు. వీడీసీ ఉపాధ్యక్షుడు వంగ రాహుల్ కుమార్, నిట్టు లింగారావు, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లకు ఆహ్వానం

ఉత్సవాలకు రావాలని కోరుతూ వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనితలను పత్రికలు అందజేసి ఆహ్వానించారు.

చర్చల పేరిట కాలయాపన తగదు



జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



నస్రుల్లాబాద్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు

- 9వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె
- ముఖానికి మాస్కులు ధరించి నిరసన

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడంపై సమగ్ర శిక్ష ఉద్యోగులు మండిపడ్డారు. తమ డిమాండ్‌లను నెరవేర్చాలని చేపడుతున్న నిరవధిక సమ్మె బుధవారంతో 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క తదితరుల చిత్రాలను ఉద్యోగులు తమ ముఖాలకు మాస్కులుగా ధరించి నిరసన తెలిపారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తమను క్రమబద్ధీకరణ చేయాలని, విద్యాశాఖలో విలీనం చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి భాను, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీవాణి, శైలజ, కాళిదాసు, దినేష్, శంకర్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఎస్జీటీల ఫోరం ఉపాధ్యాయులు శ్రీదేవి, రజిత, జ్యోతి, స్రవంతి, వెంకటేష్, శశిధర్, బాలకృష్ణ, గంగాధర్ తదితరులు మద్దతు తెలిపారు.

ఉపాధ్యాయుల మద్దతు

నస్రుల్లాబాద్/నిజాంసాగర్/బాన్సువాడరూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు నస్రుల్లాబాద్, బాన్సువాడ, నిజాంసాగర్ మండలాల ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. ప్లకార్డులు చేతబూని ఉద్యోగులకు అనుకూలంగా నినాదాలు చేశారు.



నిజాంసాగర్‌లో..



బోర్లంలో ..

కేకేవై రోడ్డుతో ఎల్లారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి



ఎల్లారెడ్డి: కరీంనగర్- కామారెడ్డి- ఎల్లారెడ్డి(కేకేవై) రోడ్డును జాతీయ రహదారిగా విస్తరిస్తే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీలో అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కేకేవై రోడ్డు నిర్మాణ పనుల గురించి మాట్లాడారు. కేకేవై రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేలా మంత్రి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు.

వెదజల్లే పద్ధతిలో వరినాట్లతో అధిక దిగుబడి



ఎల్లారెడ్డిరూరల్: వెదజల్లే పద్ధతి ద్వారా వరి నారు వేయడం వల్ల వరిలో అధిక దిగుబడులను సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్‌రెడ్డి, రేవంత్ నాతన్‌లు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేటలో వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్న వరి పంటలను వారు పరిశీలించారు. ఈ పద్ధతి ద్వారా ఖర్చుతో పాటు, కూలీల సంఖ్య తగ్గుతుందని, దిగుబడి పెరుగుతుందన్నారు. ఏఈవో రాజాగౌడ్, రైతులు తదితరులున్నారు.

గౌరవ వేతన హామీని అమలు చేయాలి



జిల్లా కేంద్రంలో దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కామారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన రూ.10 వేల గౌరవ వేతన హామీని తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్లాబ్ రేట్లను పెంచాలని, గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు రాజనర్సు, కృష్ణ గౌడ్, వెంకటేష్, సరస్వతి, వనజ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు

- పస్తులున్న విద్యార్థులు



పాఠశాలలో కూర్చున్న విద్యార్థులు

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే నిర్వాహకులు వంటలు చేయకుండా సమ్మె చేస్తున్నారు. బుధవారం నుంచి రెండు రోజులు సమ్మె చేస్తున్నాము.. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు.. గుడ్డు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి.. గిట్టుబాటు కావడం లేదు.. చార్జీలు పెంచాలని సమ్మె బాట పట్టారు. పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు కొందరు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకున్నారు.. మరికొందరు విద్యార్థులు పస్తులున్నారు. నిర్వాహకులు సమ్మెలో ఉన్నారు ఇంటి నుంచి టిఫిన్ వెంట తీసుకొని రావాలని ఉపాధ్యాయులు సూచించకపోవడంతో విద్యార్థులు పస్తులుండాల్సి వచ్చింది. పస్తులున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎలాంటి వసతి కల్పించకపోవడంతో సాయంత్రం వరకు ఆకలితో అలమటించారు.

సంక్షిప్తం

నూతన బోరు మోటారు ప్రారంభం

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 41వ వార్డులో నూతన బోరు మోటారును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకృష్ణమూర్తి, పంపరి లత, మమత, వనిత, తదితరులున్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు బోరు మోటారును ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు ఆములు, సత్యం, సాయిలు, హమీస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో బుధవారం బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను నియమించారు. గ్రామలోని బూత్ నంబర్ 102, 103లకు సుబ్బారావు, దత్తారెడ్డిలను నియమించినట్లు మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. మండల కార్యదర్శి సంతోష్‌రెడ్డి, శక్తి కేంద్ర నిర్వాహకులు శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మాచారెడ్డి: బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం పాల్వంచ మండలం ఇసాయిపేటలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవల పట్ల అవగాహన కల్పించారు. సిబ్బంది ప్రవీణ్, గ్రామస్తులు ఉన్నారు.

బజరంగ్‌దళ్‌లో చేరిన యువకులు

కామారెడ్డి అర్బన్: బజరంగ్‌దళ్‌లో బుధవారం పలువురు యువకులు చేరినట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బొల్లిరాజు, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ వివేకానంద అశోక్‌లు తెలిపారు. చేరిన వారిలో చేపూరి హరితేజ, వడ్ల అక్షయ్‌కుమార్, బ్రహ్మాజీ, శివసాయి, కృష్ణ చైతన్య, సాయిగణేష్, శివ, రాజేశ్వర్, కార్తీక్ ఉన్నారు.

పలు పాఠశాలల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో వెంకటేశం బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు సక్రమంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే కేవీఆర్

బీబీపేట: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ విమర్శించారు. బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లడారు. గెలిచిన నాటి నుంచి ఒక్క రూపాయి కూడా నియోజకవర్గానికి తీసుకురాలేదని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, భూమాగౌడ్, సత్తయ్య, తదితరులున్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసిన టీఎన్‌జీవోలు

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు చేయడంలో ఉద్యోగులు, అధికారులు అంకిత భావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం టీఎన్‌జీవోస్ నూతన అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి తన కార్యవర్గం ప్రతినిధులతో కలెక్టర్, అదనపు కలెక్టర్లను మర్యాదపూర్వకంగా పరిచయం చేశారు. అసోసియేట్ అధ్యక్షుడు ఎం.చక్రధర్, కార్యదర్శి ముల్క నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.